సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 31 । జూలై । 2023



ఒంటిమిట్ట చెరువులో ట్రయల్ రన్

ట్రయో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తయారు చేసిన బోటును ఒంటిమిట్ట చెరువులో ట్రయల్ రన్ చేశారు. -8లో



నెత్తురోడుతున్న రోడ్లు

అన్నమయ్య జిల్లాలో జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయి.7నెలల్లో 393 ప్రమాదాలు జరిగాయి.149 మంది మృతి చెందారు. 500 మందికి గాయాలయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1600	రూ.1940
రెండోరకం	రూ.1200	రూ.1580

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు (సోమవారం) స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులతో సహా కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

హార్సిలీ అందాలు వీక్షించిన హైకోర్టు జడ్జి



పాత వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తున్న న్యాయమూర్తి

బి.కొత్తకోట: హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కే.మన్మథరావు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ప్రకృతి అందాలను వీక్షించారు. శనివారం రాత్రి ఉండవల్లి నుంచి కొండకు చేరుకున్న ఆయన గవర్నర్ బంగ్లా అతిథిగృహంలో విడిది చేశారు. ఆదివారం పాత వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. అక్కడి నుంచి గాలిబండ, అటవీ పర్యావరణ సముదాయంలో పర్యటించారు. అనంతరం కొండపైనుంచి వెనుదిరిగారు.

ఒంటిమిట్ట రామయ్యకు వెండి బొమ్మల సమర్పణ



స్వామి వారి వెండి బొమ్మను ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు అందజేస్తున్న నారాయణ శెట్టి, కుటుంబ సభ్యులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం మూల మూర్తులకు సీతారామలక్ష్మణ, హనుమంతులు ఉన్న వెండి బొమ్మను సమర్పణ చేశారు. ఈ మేరకు ఆలయ ఇన్‌స్పెక్టర్ వివరాలు వెల్లడించారు. సీతారామలక్ష్మణ, హనుమంతులు ఉన్న ఈ వెండి బొమ్మను చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, చరలపల్లి గ్రామానికి చెందిన ఎన్. నారాయణ శెట్టి అనే వ్యక్తి స్వామి వారికి సమర్పించారన్నారు. వీటి బరువు దాదాపు 600 గ్రాములు, విలువ దాదాపు రూ. 50 వేలు ఉండవచ్చన్నారు. వీటిని స్వామి వారికి సమర్పించాలని దాత ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులకు అందజేశారు.

9న ఆడికృత్తిక ఉత్సవం

కడప కల్చరల్: స్థానిక దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలోగల శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామిలకు ఆగస్టు 9న ఆడి కృత్తిక ఉత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, అర్చకులు ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8.00 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, మధ్యాహ్నం 12.00 గంటలకు అర్చన, మహానైవేద్యం, మంగళ హారతి తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6.00 గంటలకు గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. ఉదయం 11.00 గంటలకు సహస్ర నామార్చన అనంతరం భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలతో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకారం నిర్వహిస్తామన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కేవీ రాఘవులు

మదనపల్లె సిటీ: ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోం నందు మదనపల్లె తాలూకా అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 21,22న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహాసభలు జరుగుతాయన్నారు. 21న జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. ఎన్జీవోలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ మహాసభల్లో సంఘ సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె శాఖ అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి రెడ్డిశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

తవ్వేస్తున్నారు..

ధన దాహం..చరిత్రకు శాపం

- మాయమవుతున్న పురాతన శాసనాలు
- ములకలచెరువు మండలంలో తమిళ, తెలుగు, దేవనాగరి శాసనాలు
- చారిత్రక సంపదను పురావస్తుశాఖ పరిరక్షించాలంటున్న ప్రజలు



సోంపల్లి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఊంజల్ మండపంపై ఉన్న ముత్యాలమ్మ శాసనం

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలంలో అత్యంత పురాతన శాసనాలు వెలుగు చూస్తున్నాయి. ఇవి దేవనాగరి, తెలుగు, తమిళ లిపిలో ఉన్నాయి. క్రీస్తు శకం ఐదో శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు రాజులు, చక్రవర్తులు, పాలెగాళ్లు వీటిని వేయించారు. ఇక్కడి శాసనాలు ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లు. ఈ ప్రాంతాన్ని పాలించిన పల్లవులు, చోళులు, చాళుక్యులు, విజయనగరరాజులు, పాలెగాళ్లు ఆరోజుల్లో ఆలయాలకు, కవులు, పండితులు, కళాకారులు, వీరులకు మాన్యాలు, భూములు, అగ్రహారాలు దానాలు చేశారు. ఈ వివరాలను రాళ్లమీద చెక్కించారు. ఈ శాసనాల ద్వారా రాజుల చరిత్ర, వంశ వివరాలు, పరిపాలనా విధానాలు, ఆ కాలం నాటి ఆచార వ్యవహారాలు వెల్లడవుతున్నాయి. ఒక్క ములకలచెరువు మండలంలోనే 30కి పైగా పురాతన శాసనాలు వెలుగులోకి వచ్చాయి. చాలా చోట్ల ఇవి దిక్కూ మొక్కూ లేకుండా పడివున్నాయి. వీటి కింద నిధులు దాచి ఉంటారనే దురాశతో శాసనాలను తవ్వి నాశనం చేస్తున్నారు. కొన్ని ఆలయాల గోడలపై ఉన్న అక్షరాల మీద సిమెంట్ పూతలు వేసేశారు. మరికొన్ని ఇళ్ల గోడల్లోకి వెళ్లిపోయాయి. ఇంకొన్ని కంకర రాళ్లుగా మారిపోయాయి. వీటి విలువ తెలియక ధ్వంసం చేస్తున్నారు. పురావస్తుశాఖ పూనుకోకపోతే మిగిలిన చారిత్రక సంపద కూడా అంతరించిపోయే ప్రమాదం ఉంది.

తామర శాసనం...

17వ శతాబ్దం నాటికి ఈ ప్రాంతమంతా చిన్నచిన్న పాలెగాళ్ల పాలనలో ఉండేది. కొద్ది కాలం పాటు మరాఠీల పాలనలో ఉండేది. అప్పట్లో దేవులచెరువు ప్రాంతాన్ని వెంకటాచలపతి నాయునివారు పాలించేవారు. మహారాష్ట్ర రాష్ట్రం పుణెకు చెందిన బనోజ్ పండితులు అనే మరాఠి బ్రాహ్మణుడు పీష్వాల తరపున చిన్నచిన్న పాలకుల నుంచి కప్పం వసూలు చేసేందుకు జమాబందీ కోసం వచ్చేవారు. పీష్వాల దర్బార్‌లో తమ పలుకుబడి ఉపయోగించి వేపూరికోట, బురకాయలకోట, మద్దినాయునిపల్లె, పెద్దపాళ్యం, కదిరినాథునికోట ప్రాంతాలను వెంకటాచలపతి నాయుని పాలన కిందకు వచ్చేలా ఉత్తర్వులు తెచ్చారు. అందుకు కృతజ్ఞతగా కదిరినాథునికోట గ్రామాన్ని బనోజీ పండితులకు సోత్రియం గ్రామం ఇనాముగా ఇచ్చారు. బనోజీ పండితులకు సూర్యచంద్రుల సాక్షిగా కదిరినాథునికోట గ్రామాన్ని ఇనాముగా ఇస్తున్నట్లు తామరపత్రంపై శాసనం రాయించి ఇచ్చారు. అప్పట్లో వెంకటాచలపతి నాయునివారి ఆస్థానంలో ఉంటున్న తలకాయలకొండ పాపన్న ఈ శాసనాన్ని రాసినట్లు ఉంది.

ముత్యాలమ్మ శాసనం....


సోంపాళ్యంలో అద్భుత శిల్ప సంపదతో కూడిన చెన్నకేశవస్వామి ఆలయాన్ని పాలెగాడు ద్వాదశి కృష్ణప్ప నాయని వారు నిర్మించారు. నాయని వారి కుమార్తె పేరు ముత్యాలమ్మ. ఆమెకు చెన్నకేశవ స్వామిపై భక్తి ఎక్కువ. సేవకు ఆలయం ఆవరణలో 40 అడుగులు ఎత్తయిన నాలుగు స్తంభాలతో ఊంజల్ మండపాన్ని కట్టించారు. ఆ వివరాలతో మండపం స్తంభాలపై తెలుగులో శాసనం వేయించారు.

▸▸ చెరువుకట్టపై పల్లవ శాసనం



పర్తికోట సమీపంలోని దేవులచెరువు కట్టపై ఉన్న రాయి. పల్లవ చక్రవర్తి మూడవ నరేంద్ర వర్మ వేయించిన శాసనం. ఈ చెరువును నిర్మించిన ఆయన శాసనం వేయించాడు. ఈ చెరువు కింద సాగయ్యే 20 కుంట్ల ధాన్యం కట్టమీద ఉన్న అంకాల పరమేశ్వరి అమ్మవారి పూజా కార్యక్రమాలకు వినియోగించాలని శాసనంలో రాశారు. ఈ శాసనంలో పల్లవ చక్రవర్తుల వంశావళి, ఇతర వివరాలు ఉన్నాయి. గత పదేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన పురావస్తుశాఖ అధికారులు వచ్చి దీనిని పరిశీలించారు. పర్తికోట ప్రాంత ప్రజలు ఈ శాసనాన్ని సాసవ రాయిగా పిలుచుకుంటారు.

▸▸ గౌడచెరువు శాసనం..



ములకలచెరువు మండలం కాలువపల్లె పంచాయతీ బుద్ధవారిపల్లె సమీపంలో గౌడచెరువు కట్ట మీద తెలుగు శాసనం ఉంది. ఇది 15వ శతాబ్దం నాటిది. ఈ ప్రాంతాన్ని పాలించిన తిరువెంగల రాజావారు. ఈ చెరువు కింద ఐదెకరాల రాజమాన్యం తిరుమల వెంకటేశ్వరస్వామి కైంకర్యం కోసం ఇస్తూ శాసనం వేయించారు. ఈ భూమిపై వచ్చే ఆదాయం శ్రీనివాసుని పూలంగి సేవకు ఉపయోగించాలని శాసనంలో పేర్కొన్నట్లు పురావస్తు శాఖ అధికారులు తేల్చారు. తిరువెంగల రాజా పేరిట వారి పురోహితుడు ఈ శాసనాన్ని వేయించాడు.

▸▸ నిధుల కోసం తవ్వితే...



ములకలచెరువు మండలంలో వెలుగు చూసిన దేవనాగరి లిపి శాసనాల్లో ఏడూర్ల కాలువపల్లె కోటలోని శాసనం పురాతనమైనది. వైభవంగా వెలిగిన కాలువపల్లె కోట 16వ శతాబ్దం నాటికే శత్రు రాజుల దండయాత్రలో ధ్వంసమైపోయింది. ఎన్నో శిల్పాలు, శాసనాలు మట్టిలో కూరుకుపోయాయి. నిధి దాచి ఉంటారని దుండగులు ఈ ప్రాంతాన్ని తవ్వి నాశనం చేశారు. అలాంటి తవ్వకాల్లో దేవనాగరి లిపిలోని ఈ శాసనం బయటపడింది. పురావస్తుశాఖ అధికారులు దీనిని అధ్యయనం చేసి వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

▸▸ 'కనుగొండ'ను వదల్లేదు..



ములకలచెరువు సమీపంలో కనుగొండపై కనుగొండరాయస్వామి ఆలయాన్ని విజయనగర రాజులు నిర్మించారు. చక్రవర్తి సదాశివ రాయలు కోరిక మేరకు సామంతరాజు ఈ ఆలయాన్ని కట్టించారు. దూపదీప నైవేద్యం కోసం 18 నివర్తనాల భూమిని మాన్యంగా ఇచ్చారు. ఈ వివరాలను ఆలయం ఎదుట బండపై శాసనం వేయించారు. శాసనమున్న బండకింద నిధులు ఉంటాయని దుండగులు ఎన్నోమార్లు శాసనం బండను పక్కకు తోసి తవ్వకాలు జరిపారు.

▸▸ నమ్మకం బతికించింది...



దేవులచెరువు సమీపంలోని పెద్దేరులో తెలుగులో స్వస్థత శాసనం ఉంది. తూర్పున సూర్యుడు, పశ్చిమాన చంద్రుడి బొమ్మలను పెద్దబండపై చెక్కారు. 15వ శతాబ్దం నాటి మంత్ర, తంత్రాలను పేర్కొంటూ దీనిని వేయించారు. జబ్బుపడిన పిల్లలు, అస్వస్థతకు గురైన పెద్దలు, గాయపడిన జంతువులను శాసనం ఉన్న బండపై దొర్లిస్తే జబ్బులు నయమవుతాయని ప్రజల నమ్మకం. జబ్బుపడిన పిల్లలను శాసనమున్న బండపై దొర్లించి ఆరోగ్యం ప్రసాదించమని సూర్య, చంద్రులను ప్రార్థిస్తున్నారు. ఈ నమ్మకం వల్ల ఈ శాసనం బతికిపోయింది.

హార్సిలీహిల్స్ అడవిలో చిరుతల సంచారం



బి.కొత్తకోట మండలంలోని దట్టమైన హార్సిలీహిల్స్ అటవీప్రాంతం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలో దట్టమైన అటవీ ప్రాంతం కలిగిన హార్సిలీహిల్స్‌పై మూడు చిరుతలు సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారికంగా నిర్ధారించింది. ఇటీవల పలుమార్లు చిరుతలు హార్సిలీహిల్స్ సందర్శకులకు దర్శనమిస్తున్నాయి. అయితే చిరుతలు ఎవరిపైనా దాడులు చేయలేదు. ఆవులు, గొర్రెలపైనా దాడి జరపలేదు. దట్టమైన, విస్తారమైన అడవిలో ఇవి స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. కోవిడ్ సమయంలో మాత్రమే చిరుతలు కొండపైకి వచ్చి కుక్కలను చంపి తిన్నాయి. తర్వాత కొండపైకి ఇవి రాకపోయినా ఘాట్‌రోడ్లు, సమీప అటవీప్రాంతాల ప్రజలకు కనిపిస్తున్నాయి. హార్సిలీహిల్స్ అటవీప్రాంతం తూర్పున కురబలకోట మండలం తెట్టు, దక్షిణాన కర్ణాటకలోకి రాయల్పాడు. పడమర గట్లమీద పల్లె, టేకులపెంట వరకు విస్తరించి ఉంది. 1882లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించిన మేరకు 6,231 హెక్టార్ల రిజర్వ్‌ఫారెస్ట్ ఉంది. ఇదికాక ఎ రిజర్వ్‌ఫారెస్ట్ 1,348 హెక్టార్లు, బీ రిజర్వ్‌ఫారెస్ట్ 1,176 హెక్టార్లు కలుపుకొని మొత్తం 8,755 హెక్టార్లలో దట్టమైన అడవి విస్తరించి ఉంది. అటవీశాఖ అధికారుల లెక్క ప్రకారం ఈ అడవిలో ప్రస్తుతం రెండు ఆడ, ఒకటి మగ చిరుతలు సంచరిస్తున్నాయి. అడవిలో చుక్కల జింకలు, కొండముచ్చులు, కోతులు, అడవిపందులు, కుందేళ్లు అధికంగా ఉన్నాయి. చిరుతలు వీటినే ఆహారంగా స్వీకరిస్తాయి. దీంతో అటవీ సమీప ప్రాంతాల్లో కొండ ఘాట్‌రోడ్డుపై సంచరిస్తూ ప్రజలకు కనిపించినా ఎలాంటి దాడులు చేయడం లేదు. గతంలో నాలుగు ఉన్న చిరుతల్లో ఒకటి అడవి దాటి వెళ్లిపోయినా మిగిలిన మూడింటి వల్ల వాటి సంతతి ఇంకా పెరిగే అవకాశం ఉందని అటవీశాఖ మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆదివారం చెప్పారు. విస్తారమైన అడవి కావడంవల్ల అన్నిచోట్ల వాటి సంచారం ఉన్నట్లు చెప్పారు. అలాగే కొండచిలువలు, హైనాలు, రేచుకుక్కల సంఖ్య గతంలో కంటే ప్రస్తుతం అధికమైనట్టు గుర్తించామని వివరించారు.

- 2010, 2011లో జరిపిన సర్వేలో అడవిలో నాలుగు చిరుతలు సంచరిస్తున్నట్టు గుర్తించగా ప్రస్తుతం మూడింటిని నిర్ధారించారు. మిగిలిన ఒక చిరుత కర్ణాటక వైపున్న అటవీప్రాంతానికి వెళ్లినట్టు భావిస్తున్నారు. చిరుతల సంచారం ఆధారంగా నాలుగు ఉన్నట్టు లెక్కకట్టారు. వీటిలో ఒక ఆడ, ఒక మగ చిరుతలు కాగా, మిగిలిన రెండు చిరుత పిల్లలుగా నిర్ధారించారు.ప్రస్తుతం సంచరిస్తున్న మూడింటిలో రెండు ఆడ, ఒక మగ చిరుతలుగా నిర్ధారించారు. అంటే హార్సిలీహిల్స్ అడవిలోకి కొత్తగా చిరుతలు రాకపోకలు సాగిస్తున్నట్లు అర్థమవుతోంది.



పుస్తకమస్తు!

సర్కారు బడుల్లోని విద్యార్థులకు సెమిస్టర్-2 బుక్స్ పంపిణీ



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెమిస్టర్-2 పుస్తకాలతో విద్యార్థులు

మదనపల్లె సిటీ: ఆకర్షణీయ చిత్రాలు... కార్టూన్లు.. నాణ్యమైన పేపర్... రంగు రంగుల ఆయిల్ ప్రింటింగ్‌తో ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ముద్రించింది. బడిగంట కొట్టిన రోజే పిల్లలకు పంపిణీ చేసింది. విద్యా సంస్కరణల్లో భాగంగా సెమిస్టర్లవారీగా సబ్జెక్టులకు అనుగుణంగా పుస్తకాలను అందుబాటులోకి తీసు కొచ్చింది. ఈ క్రమంలో సెమిస్టర్-2 పుస్తకాలను ఈ నెల 22 నుంచి ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసింది. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టింది. అందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో సిద్ధం చేసింది. 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్,నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 మండలాలకు తిరుపతి బుక్‌డిపో నుంచి పాఠ్య పుస్తకాలు 6,65,467, వర్క్ బుక్స్ 2,44,870 , ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 15 మండలాలకు కడప డిపో నుంచి రెండో సెమిస్టర్‌కు సంబంధించి 6,44,490 పుస్తకాలను 6 నుంచి 9 తరగతి విద్యార్థులకు అందజేశారు. సకాలంలో పుస్తకాలు అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా పంపిణీ

పకడ్బందీగా సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేశాం. సర్కారు బడుల్లో ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకం అందేలా చర్యలు చేపట్టాం. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీవైఈఓ, ఎంఈఓలను ఆదేశించాం. -శ్రీరాం పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

ధరలు ఘనం..దిగుబడి శూన్యం!

- గత ఏడాదితో పోల్చితే 25శాతమే టమాటా పంట దిగుబడి
- జిల్లాలో 65శాతం మూతపడిన మండీలు



గుర్రంకొండ వద్ద సాగుచేసిన టమాటా తోటలు (ఇన్‌సెట్) ఊజీ, నల్లమచ్చలరోగాలతో టమాటాలపై ఏర్పడిన రంధ్రాలు

గుర్రంకొండ: జిల్లాలో నల్లమచ్చలు, ఊజీరోగాలతో టమాటా పంట దిగుబడి తగ్గిపోయింది. ధరలు ఘనంగా ఉన్నా ఆకుమడుత, ఊజీ,నల్లమచ్చల రోగాలతో తోటలు దెబ్బతిన్నాయి. ఇటీవల అప్పుడప్పుడు కురుస్తున్న అరకొర వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా రోగాలు తోటలను ఆహించాయి. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయి మార్కెట్లో స్టాకు లేక మండీలు వెలవెలబోతున్నాయి. శనివారం మార్కెట్లో 30కేజీల టమాటా క్రేట్ ధర రూ.5500 వరకు ధరలు పలికాయి. అయితే నల్లమచ్చలు, ఊజీ రోగాల బారిన పడిన టమాటాలు కేవలం రూ.1200 వరకు మాత్రమే ధరలు పలికాయి. జిల్లాలో గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం 25శాతం మాత్రమే పంట దిగుబడి వస్తోంది. దీంతో జిల్లాలో 65శాతం మేరకు మండీలు వ్యాపారాలు లేక మూతపడ్డాయి.

- నల్లమచ్చలు, ఊజీ, ఆకుమడుత రోగాల బారిన టమాటా తోటల్లో పంట దిగుబడి సగానికిపైగా తగ్గిపోయింది. సాధరణంగా ఎటువంటి రోగాలు లేకుండా ఉంటే ఎకరానికి 750 నుంచి 800 క్రేట్ల నాణ్యమైన టమాటాల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం రోగాల కారణంగా ఎకరానికి 400కు దిగుబడి పడిపోయింది. దీంతో రైతులు నష్టపోతున్నారు. మరోవైపు రోగాలను నివారించేందుకు మందుల పిచికారీ అనదపు భారంగా మారింది. నల్లమచ్చలు, ఊజీ, ఆకుమడుత రోగాలనివారణ, అదుపు చేయడం కోసం ఎకరం తోటకు రూ.55 వేలు నుంచి రూ.70 వేలు వరకు ఖర్చు చేస్తున్నారు.

30కేజీల క్రేట్ ధర రూ. 1200

ప్రస్తుతం నాణ్యమైన టమాటాలు మార్కెట్లో 30కేజీల క్రేట్ ధర రూ.5500 వరకు ధరలు పలుకుతున్నాయి. అదే సమయంలో నల్లమచ్చలు, ఊజీ రోగాలున్న టమాటాలు 30కేజీల క్రేట్ ధర రూ. 1200 వరకు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. దీంతో ఒక క్రేట్‌కు రైతు రూ.3300 వరకు నష్టపోతున్నాడు. జిల్లాలో టామాటా పంట దిగుబడి రోజు రోజుకు తగ్గిపోతోంది. ఇదే సీజన్‌లో గత ఏడాది జిల్లాలో సాగు చేసిన పంట దిగుబడితో పోల్చితే ఈ సంవత్సరం కేవలం 25 శాతం మాత్రమే దిగుబడి వస్తోంది. గత ఏడాది ఇదేనెలలో వారం రోజుల్లో 2945 నుంచి 2398 టన్నుల వరకు దిగుబడి మార్కెట్‌యార్డులకు వచ్చింది. ప్రస్తుతం ఇదేనెలలో వారం రోజుల్లో 731 నుంచి 538 టన్నులు మాత్రమే మార్కెట్‌యార్డులకు వచ్చింది. దీంతో మార్కెట్లో టమాటా ధరలు రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

జిల్లాలోని మార్కెట్లకు ప్రస్తుతం, గత ఏడాది వచ్చిన స్టాకు వివరాలు..

తేదీ	2023లో స్టాకు (టన్నుల్లో)	2022లో స్టాకు (టన్నుల్లో)
జులై 23	731	2945
24	724	2857
25	710	2784
26	672	2652
27	645	2537
28	631	2485
29	598	2398
30	645	2620

మూతపడిన మండీలు

పంట దిగుబటి తగ్గిపోవడంతో టమాటాల స్టాకు లేక జిల్లాలోని మార్కెట్‌యార్డులోని 65 శాతం టమాటా మండీలు మూతపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో 428 మండీలు ఉన్నాయి. గత నెలవరకు 398 మండీలను నిర్వహించేవారు. ప్రస్తుతం 246 మాత్రమే నిర్వహిస్తున్నారు. పంట దిగుబడి లేకపోవడం, స్టాకు రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

రోగాలతో తోటలు దెబ్బతిన్నాయి



నల్లమచ్చలు, ఊజీతోపాటు ఇతర రోగాల బారిన పడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత వాతావరణానికి ఎకరం పంటకు సుమారు 800 క్రేట్ల దిగుబడి వస్తోంది. ఇందులో సగానికిపైగా నల్లమచ్చలు, ఊజీరోగాల బారిన పడి దెబ్బతిన్నాయి. - సుధాకర్‌రెడ్డి, చెరువుమొరవపల్లె

నల్లమచ్చలున్న కాయలకు ధరలు లేవు



ఇప్పుడున్న మార్కెట్లో నల్లమచ్చలు, ఊజీ రోగం సోకిన టమాటాలకు పెద్దగా ధరలు లేవు. మార్కెట్లో నాణ్యమైన టమాటాలు ఒక క్రేట్ ధర రూ. 5000 నుంచి రూ.5500 వరకు పలుకుతున్నాయి. నల్లమచ్చలున్న కాయలు ఒక క్రేట్ ధర రూ.1200 పలుకుతున్నాయి. దీంతో ఒకక్రేట్‌కు రూ.3300 వరకు రైతులు నష్టపోతున్నారు. - నరసింహులు, కొత్తపల్లె

తోటలు బాగా దెబ్బతిన్నాయి



యార్డులోని మండీలకు స్టాకు రావడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో వీటి ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. - జగదీష్, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

కలికిరి : పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత రైల్వే ఉద్యోగిని రాజమ్మ ఇంట్లో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రాజమ్మ నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 69 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రహీముల్లా తెలిపారు.

టమాట హమాలీ మృతి

మదనపల్లె సిటీ : స్థానిక టమటా మార్కెట్‌లో పని చేసే హమాలీ సుధాకర్(55) శనివారం అపస్మారస్థితిలో కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా శ్రీగంధం చెట్టు నరికివేత



నరికివేసిన శ్రీగంధం చెట్టును చూపుతున్న అరుణమ్మ

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్ ఎదురుగా పొలంలో ఓ శ్రీగంధం చెట్టును శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. తంబళ్లపల్లెకు చెందిన అరుణమ్మ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పొలంలో ఇల్లు కట్టుకుని ఉంది. అక్కడే పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌కు అద్దెకు ఇచ్చింది. ఇంటి చుట్టూ శ్రీగంధం చెట్లు ఉన్నాయి. చాలా ఏళ్లుగా పెంచుతున్న ఓ పెద్ద చెట్టును గుర్తుతెలియని వ్యక్తులు మిషన్‌తో కోసివేశారు. అందులో వారికి అవసరమయ్యే శ్యావ లేకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఒంటిమిట్ట చెరువులో ట్రయల్ రన్



ఒంటిమిట్ట చెరువులో బోటు ట్రయల్ రన్ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ట్రయో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు తయారు చేసిన బోటును ఆదివారం ఒంటిమిట్ట చెరువులో ట్రయల్ రన్ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ నందన్‌రెడ్డి, సునీల్ మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి సిడ్నీ, కెనడాలకు మెట్రో ట్రెన్ మ్యానుఫ్యాక్చరింగ్ చేసి పంపేవారమన్నారు. ఇప్పుడు దుబాయ్ కంపెనీకి ఎఫ్ఆర్‌పీ మెటీరియల్‌తో బోటును తయారు చేశారన్నారు. అయితే ఇండియా నుంచి అత్యధికంగా బోట్లను తయారు చేసిన ఎస్మారియో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కడపలో తయారు చేసిన బోటును ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించామన్నారు.

నెత్తురోడుతున్న రోడ్లు

- 7 నెలల్లో 393 ప్రమాదాలు
- 149 మంది మృతి, 500 మందికి గాయాలు
- అతి వేగమే ప్రధాన కారణం
- పోలీసులు, ఆర్టీఓల ఆధ్వర్యంలో డ్రైవ్‌లు



ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద ఆర్టీసీ బస్సును ట్యాంకర్ ఢీకొనడంతో.. సంఘటన స్థలంలోనే మృతి చెందిన ముగ్గురు (ఫైల్)



సంబేపల్లె మండలం దేవపట్ల వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని బోల్తా పడిన ఆటో (ఫైల్)

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయి. రోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతోంది. కుటుంబ సభ్యులు, తోటి మిత్రులు, వివిధ పనుల నిమిత్తం ప్రయాణమై బయలుదేరిన అనేక మంది గమ్యం చేరుకోకుండానే తనవు చాలిస్తున్నారు. మరి కొందరు తీవ్ర గాయాల పాలై అష్టకష్టాలు పడుతున్నారు. ఈ సంఘటనలు ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. దీంతో వారు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

■ వారం రోజుల క్రితం రాజంపేట-రైల్వేకోడూరు మార్గంమధ్యలోని ఓబులవారిపల్లె వద్ద ఆర్టీసీ బస్సును ట్యాంకరు ఢీకొనడంతో.. ఐదుగురు మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడ్డారు.

■ జూన్‌లో రామాపురం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జీపులో వెళ్తున్న ఐదుగురు మృత్యువాత పడ్డారు.

■ మూడు నెలల కిందట గాలివీడు మండల కేంద్రం సమీపంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు.

■ నాలుగు రోజుల క్రితం సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆగి వున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాల పాలైంది.

■ ఇలా అనేక ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల కారణంగా చాలా మంది తిరిగిరాని లోకాలకు వెళ్తున్నారు. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జాతీయ రహదారులపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

■ అతివేగం, మద్యం మత్తు, మలుపులు గుర్తించకపోవడం వంటి కారణాలు పెను ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.

■ గతంలో రాజంపేట, రైల్వేకోడూరు మీదుగా వెళ్లే కడప-తిరుపతి జాతీయ రహదారిలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో జాతీయ రహదారుల సంఖ్య ఐదుకు పెరగడంతో ప్రమాదాల సంఖ్య కూడా అధికమైంది. వీటికి తోడు జిల్లా పరిధిలోని అంతర్గత ప్రధాన రహదారుల్లో కూడా ప్రమాదాలు పెరిగాయి.

■ ముఖ్యంగా కడప-తిరుపతి, కడప-చిత్తూరు, రాయచోటి-మదనపల్లి, కదిరి-తిరుపతి, మదనపల్లి - బెంగళూరు, చాగలమర్రి-ప్రొద్దుటూరు-రాయచోటి జాతీయ రహదారుల్లో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ మార్గాలలో వెళ్తున్న పాదచారులు, ద్విచక్రవాహనదారులే కాకుండా కార్లు, జీపులు, బస్సులు, లారీల ప్రమాదాల కారణంగా వందలాది మంది మృత్యువు ఒడిలోకి జారుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 7 నెలల్లో..

జిల్లా వ్యాప్తంగా 2023లో 7 నెలల్లో 393 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాలలో 194 మంది తనువు చాలించారు. 500 మందికి గాయాలయ్యాయి. మృతి చెందిన సంఘటనలపై 177 కేసులు నమోదయ్యాయి. మరో 216 ప్రమాద సంఘటనల్లో గాయాల కేసులు నమోదయ్యాయి.

పెరిగిన రద్దీ

■ అన్నమయ్య జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. జిల్లాలో 5 జాతీయ రహదారులతోపాటు రాజంపేట-తుముకూరు స్టేట్ హైవే ఉన్నాయి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రధాన ప్రాంతాలను కలిపే రహదారులు ఉండటంతో.. అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. అలాగే సిమెంటు, నాపరాయి, ముగ్గురాయి, కూరగాయలు, అరటి, మామిడి, చీనీ, నిమ్మ ఇతర పంటల రవాణా ఈ ప్రాంతం నుంచి అధికంగా సాగుతుంది.

■ కడప-తిరుపతి, కడప-రాయచోటి-చిత్తూరు, కదిరి-మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారులపై అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై అధికంగా మలుపులు ఉండటం, రహదారులను కలిపే లింక్ రోడ్లు ఉండటంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఇందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడం సమస్యకు కారణమవుతోంది.

■ మదనపల్లి-పీలేరు మీదుగా తిరుపతి రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే కడప-తిరుపతి రోడ్డు విస్తరణ పనులు కూడా ఒకవైపు జరుగుతున్నాయి. నూతనంగా మంజూరైన చాగలమర్రి-ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల-వేంపల్లి-రాయచోటి విస్తరణ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు.

■ ఒకవైపు డబుల్‌రోడ్లు, నాలుగు లైన్ల రహదారుల నిర్మాణాలు జరుగుతున్నా ప్రమాదాల నివారణకు క్లెం వేయలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

భారీ వాహనాలే కారణం

ప్రధాన రహదారుల్లో బండరాళ్లు తరలించే టిప్పర్లు, సిమెంటు, పరిశ్రమలకు అవసరమైన పెద్ద వస్తువులను తరలించే భారీ వాహనాలు, భవన నిర్మాణ సామగ్రి తీసుకెళ్లే లారీలు, ట్రక్కులు, డీసీఎంలు అతివేగంగా ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలు, ద్విచక్రవాహనదారులు, పాదచారులపై దూసుకెళ్తున్నాయి. ఇలాంటి తరహా ప్రమాదాలే జిల్లాలో తరచుగా జరుగుతున్నాయి. అంతర్గత రహదారుల్లోనైనా వేగానికి క్లెం వేస్తే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చు.

ప్రత్యేక డ్రైవ్‌లు చేస్తున్నాం



రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నాం. ముఖ్యంగా అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాం. జిల్లాలో 37 ప్రమాదకర మలుపులను గుర్తించి ఆ ప్రాంతాలలో పుటాకార దర్పణం(అద్దాలు) ఏర్పాటు చేశాం. తెల్లవారుజామున ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించి వాహనాలను ఆపి డ్రైవర్లను మొఖం నీటితో కడుక్కోమని చెప్పి.. నీళ్లు, టీలు తాపి పంపించే చర్యలు చేపట్టాం.

- గంగాధర్‌రావు, ఎస్పీ, అన్నమయ్య జిల్లా

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం



ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం సర్వే చేసింది. డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. మిగతా రోడ్లను కూడా విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రమాదాల నివారణకు సుచిత్ర జంక్షన్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు డివైడర్లను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరాం. మొదటి విడతలో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి లయోలా వరకు డివైడర్లను ఏర్పాటు చేస్తాం. వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

- దినేష్‌కుమార్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారి, అన్నమయ్య జిల్లా

అయ్యో.. వెన్నెలా!

- మృత్యువుతో పోరాడి.. ఓడింది
- తొమ్మిది రోజులుగా కోమాలో..
- చిన్న ఓరంపాడు వద్ద ప్రమాదంలో గాయపడి..



వెన్నెల (ఫైల్)

రాజంపేట : నందలూర మండలం చింతలకుంట గ్రామానికి చెందిన పప్పు వెన్నెల (16) మృత్యువుతో పోరాడి ఓడింది. సరిగ్గా తొమ్మిది రోజుల కిందట ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై కోమాలోకి వెళ్లింది. తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అంత్యక్రియలు నిర్వహించారు. చింతలకుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెన్నెల మృతితో కుటుంబంతోపాటు, బంధువులు, గ్రామస్తులు తల్లడిల్లిపోయారు.

హోమ్‌సిక్ సెలవులతో..

తిరుపతిలోని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వెన్నెల హోమ్‌సిక్ సెలవులు ఇవ్వడంతో ఎంచక్కా ఊరిలో ఉందామని తిరుపతి-కడప బస్సులో ఈ నెల 22న బయలుదేరింది. తోటి విద్యార్థిని, సమీప బంధువు సిద్దవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన, మేనమామ కూతురు నిఖితారెడ్డితో కలిసి బస్సులో సరదాగా మాట్లాడుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో మృత్యువు లారీ రూపంలో కబళించింది. సీట్లలో కూర్చున్న ఇద్దరూ తీవ్ర గాయాల బారిన పడ్డారు.

బతికి వస్తుందనే ఆశలతో..

తమ గ్రామానికి చెందిన వెన్నెల బతికి వస్తుందనే ఆశతో చింతలకుంట గ్రామస్తులు, బంధువులు ఎదురుచూశారు. మూడు రోజులు దాటిపోతే ప్రమాదం లేనట్లే అనే భావనలో ఉండేవారు. మృతదేహం రాక జీర్ణించుకోలేకపోయారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. వెన్నల తండ్రి రామచంద్రారెడ్డి, తల్లి రమాదేవిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. వెన్నెల మృతదేహానికి ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చారు. వెన్నెలకు కన్నీటి వీడ్కోలు పలికారు చింతలకుంట వాసులు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడిన సునీల్

సిద్దవటం : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. సిద్దవటం మండలంలోని చాముడేశ్వరిపేట గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో సునీల్, విశ్వనాథ్ అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిట్వేలి నుంచి కడపకు సునీల్, విశ్వనాథ్‌లు బైక్‌పై వెళ్తున్నారు. బద్వేలు నుంచి తిరుపతికి కారు వస్తోంది. ఈ రెండు వాహనాలు సిద్దవట మండలంలోని చాముండేశ్వరిపేట గ్రామ సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిట్వేలికి చెందిన సునీల్, విశ్వనాథ్ తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సునీల్‌ను తిరుపతికి తరలించారు. డ్రైవర్ కారును వదిలేసి పరారయ్యారు. దీంతో కారును పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య,భర్తకు గాయాలు

మదనపల్లె సిటీ : లారీ, బైక్ ఢీకొని భార్య,భర్త గాయపడిన సంఘటన గుర్రంకొండ మండలం చిట్టిబోయనపల్లె వద్ద ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి పంచాయతీ నాగిళ్లవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ (35), భార్య ప్రసన్నలక్ష్మి (30)లు గుర్రంకొండ వద్దనున్న రెడ్డమ్మకొండ దర్శనం కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరారు. చిట్టిబోయనపల్లె వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డిశేఖర్, ప్రసన్నలక్ష్మి గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మస్తాన్‌స్వామి ఉరుసు ప్రారంభం

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామంలో మస్తాన్‌స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా ప్రారంభం అయింది. మధ్యాహ్నం స్వామి వారికి గంధం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గుండం ఏర్పాటు చేయడం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం గుండం ప్రవేశం, గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామాంజనేమపురంలో నివాసం వుంటున్న ఆంజనేయులు (39) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తమ్ముని భార్య డెలివరీ కోసం వెళ్లగా, వారి కోసం భార్య రమాదేవి వెళ్లింది. తిరిగి వచ్చేలోపు ఈ సంఘటన జరగడంతో భార్యతో పాటు, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. కడప రిమ్స్ పీఎస్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మైదుకూరు : మైదుకూరు మండలం జీవీ సత్రం వద్ద లారీ ఢీకొని భూమిరెడ్డి రఘురామిరెడ్డి (60) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. మైదుకూరు-బద్వేలు రహదారిలోని జీవీ సత్రం వద్ద అదే ప్రాంతంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి మైదుకూరు నుంచి బైక్‌పై గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తీగలాగితే డొంక కదిలింది!

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్‌పై నిలిపివుంచిన బైక్ చోరీకి గురైంది. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు తీగలాగితే డొంక కదిలింది. ఒక బైక్ కోసం విచారిస్తున్న పోలీసులకు పెద్ద ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు పెద్దసంఖ్యలో బైక్‌లు చోరీలకు పాల్పడిన ముఠాను గుర్తించినట్టు తెలుస్తోంది. ఈనెల 25న పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌కు వచ్చిన మదనపల్లె రూరల్ మండలం కోటవారిపల్లె తండాకు చెందిన రెడ్డెప్పనాయక్ బైక్‌ను కొండపైనే పార్క్ చేసి మరుసటిరోజు తీసుకెళ్లేందుకు రాగా కనిపించలేదు. దీనిపై బాధితుడు రెడ్డెప్పనాయక్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సాధారణ బైక్ చోరీనే కదా అని పోలీసులు లైట్ తీసుకుంటారు. అయితే నేరాల చిక్కుముడి విప్పడం, కేసుల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించే ఎస్ఐ కె.రామమోహన్ కేసు విచారణ చేపట్టారు. చోరీలకు పాల్పడే ముఠాలు, వారెక్కడెక్కడ ఉంటారు, ఏ ప్రాంతాల్లో బైక్‌లను చోరీలకు పాల్పడుతుంటారో ఆరా తీశారు. హార్సిలీహిల్స్‌పై బైక్ చోరీ ఎలా జరిగి ఉంటుంది అనే దానిపై పూర్తి దర్యాప్తు చేసి వివరాలు, ఆధారాలు సేకరించారు. హార్సిలీహిల్స్‌పై బైక్‌ను చోరీ చేసింది ఓ ముఠాగా నిర్ధారించుకున్న ఎస్ఐ రామమోహన్ ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. బైక్‌ను చోరీ చేసిన ముఠాలో అన్నమయ్య, నెల్లూరు జిల్లాకు చెందిన వారు సభ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఈ ముఠా సభ్యులు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పెద్దసంఖ్యలో బైక్‌లను చోరీ చేసినట్టుగా ఆధారాలు సేకరించినట్టు తెలిసింది. బాధితులు తమ ప్రాంతాల్లో నిలిపివుంచిన బైక్‌లను చోరీ చేసి, వాటిని విక్రయిస్తున్నట్టు విచారణలో తేలినట్టు తెలిసింది. లక్షల్లో విలువైన బైక్‌లను చోరీ చేసినట్టు విచారణలో గుర్తించారని తెలిసింది. దీనిపై పలు పోలీస్‌స్టేషన్ల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ముఠా సభ్యుల నేర చరిత్రకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. కేసులో నిందితులను అరెస్ట్ చేసేందుకు ఎస్ఐ పోలీసు బృందంతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



నాగేశ్వరి (ఫైల్)

రాయచోటి టౌన్ : అత్తారింటి వేధింపులు తాళలేక చింతమాని నాగేశ్వరి (40) ఆదివారం ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లి మండలం ఈడిగపల్లెకు చెందిన దాసరయ్యగారి వెంకటరమణ, సులోచనల గారి నాగేశ్వరిని చిన్నమండెం మండలానికి చెందిన నాగేశ్వర (అలియాస్ నగేష్)కు రూ.3 లక్షల డబ్బు, 10 తులాల బంగారం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు చిన్నమండెం నుంచి 10 సంవత్సరాల క్రితమే రాయచోటికి జీవనోపాధి కోసం వచ్చారు. ఈ క్రమంలో ఆమె ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తోంది. నగేష్ ప్రైవేట్ పనులు చేస్తుండటంతో పాటు ఓ పత్రిక (సాక్షి కాదు)లో విలేకరిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆరు నెలలుగా అత్తామామలతో పాటు భర్త అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు కొనసాగుతుండేవి. శనివారం రాత్రి తన పుట్టిన ఊరు అయిన ఈడిగపల్లెలో జరిగే పీర్లపండుగకు వెళ్లాలని భర్తను కోరింది. అందుకు ససేమిరా అన్నారు. అయితే ఆదివారం తమ ఇంటికి భోజనానికి రావాలని మృతురాలి తమ్ముళ్లు ఫోన్ చేయడంతో మళ్లీ భర్తను కోరినట్లు బంధువులు తెలిపారు. తెల్లవారి ఏమి జరిగిందో తెలియదు కానీ 6-7 గంటల మధ్య సమయంలో పిల్లలు అందరినీ బయటకు పంపించారు. నగేష్ ఇంటిలో లేకుండా బయటకు వెళ్లిపోయాడు. అత్త మాత్రం ఇంటిలో ఉంది. స్టోర్ రూంలో నాగేశ్వరి అపస్మారక స్థితిలో పడి ఉంది. తరువాత పిల్లలు బయట నుంచి ఇంటిలోకి వచ్చిన తరువాత గుర్తించడంతో బంధువులకు ఫోన్ చేసి తెలియజేశారు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయి పడి ఉంది. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా ఆమె పరిస్థితి విషమంగా ఉందని కడపకు రెఫర్ చేశారు. మార్గం మధ్యంలో మృతి చెందడంతో తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు నగేష్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి



రమణమ్మ (ఫైల్)

మదనపల్లె సిటీ : బైక్ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం క్రిష్ణాపురం వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. క్రిష్ణాపురానికి చెందిన బాలకృష్ణ భార్య రమణమ్మ (62) ఇంటి ముందు నిలుచొని ఉండగా.. ఓ యువకుడు ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. వెంటనే వాహనచోదకుడు పారిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు రమణమ్మను 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమణమ్మ మృతి చెందింది. ఔట్‌పోస్టు పోలీసులు పుంగనూరు పోలీసులుకు సమాచారం పంపారు.

గురు పీఠానికి గౌరవం బిషప్ అరుళయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ మల్లవరపు ప్రకాశ్, విశ్వాసులు

కడప కల్చరల్ : క్రైస్తవ గురు పీఠానికి బిషప్ అరుళయ్య గౌరవ ప్రతిష్టలు తెచ్చి పెట్టారని విశాఖపట్టణం అగ్ర పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ బిషప్ మల్లవరపు ప్రకాశ్ అన్నారు. బిషప్‌గా ఆయన పదవీ స్వీకారం చేసి 25 సంవత్సరాలైన సందర్భంగా బిషప్ అరుళయ్య 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కడప నగరంలోని క్యాథడ్రల్ చర్చిలో బిషప్ అరుళయ్యపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక విశ్వాసి, శాంతి సేవా సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ రచించిన ఈ పుస్తకం ఆవిష్కరణకు ముందు గురువులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బిషప్ మల్లవరపు ప్రకాశ్ మాట్లాడుతూ కడప మేత్రాసనం ఆరోగ్యమాత విచారణ నుంచి సామాన్యమైన గృహస్తులైన క్రైస్తవులు అరుళయ్య తండ్రి గురించి పుస్తకం ఉండాల్సిన అవసరం గురించి చర్చించారని, ఆ ప్రేరణతో ప్రసాద్ పుస్తకం రచించానని తెలిపారు. అరుళయ్య తండ్రి సామాన్య ప్రజలకు ఎంత చేరువలో ఉండేవారో ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. 24 పేజీల ఈ చిన్న పుస్తకంలో బిషప్ అరుళయ్య జీవిత చరిత్రను విశ్వాసులకు అందించే ప్రయత్నం చేశారన్నారు. ఆయన బాల్యం, విద్య, గురుత్వ జీవితం, బిషప్‌గా అందించిన సేవలు, పదవీ విరమణ, శేష జీవితం, అస్తమయం తదితర విషయాలన్నీ ఇందులో పొందుపరిచారని తెలిపారు. పుస్తక రచయిత ప్రసాద్ మాట్లాడుతూ బిషప్ అరుళయ్య లాంటి వారు సమాజానికి ఎంతో అవసరమని, ఆయన అందించిన సేవలకు స్ఫూర్తిగా తాము శాంతి సేవా సొసైటీని స్థాపించామని, మేత్రాసన అనుమతితో భవిష్యత్తులో విస్తృతమైన సేవలు అందించగలమని తెలిపారు. కార్యక్రమంలో మేత్రాసన కోశాధికారి పెండ్లికట్ల దేవదాసు, ఎంపీఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, సెయింట్ జోసెఫ్ పాఠశాల, కళాశాల డైరెక్టర్లు ఫాదర్ ఆరోగ్యస్వామి, సుధాకర్, పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ పాదర్ వరప్రసాద్, ఆరోగ్యమాత, నిర్మల కాన్వెంట్, జేఎంజే, క్రీస్తు జ్యోతి మదర్లు, సిస్టర్లు, సొసైటీ కార్యదర్శి మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం, లేడీస్ కార్నర్ దగ్ధం



అగ్ని ప్రమాదానికి గురైన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్

చెన్నూరు : చెన్నూరు సరస్వతినగర్‌లోని ఉమామహేశ్వర శారీ సెంటర్, లేడీస్ కార్నర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. షాపులోని చీరలు, స్టీల్ సామాన్లు, గాజులు, పెర్ఫ్యూమ్ ఫ్యాన్సీ ఐటమ్స్, కుట్టు మిషన్లు మొదలగు సామాన్లు మొత్తం కాలి బూడిదైనట్లు బాధితురాలు హసనాపురం రామ లక్షుమ్మ తెలిపారు. బతుకు దెరువు కోసం అప్పు చేసి చీరల వ్యాపారం చేస్తూ ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకోవడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. శనివారం రాత్రి షాపులో నుంచి దట్టమైన పొగలు రావడంతో ఇరుగు పొరుగు వారు గమనించి తమకు తెలియజేశారన్నారు. దీంతో తాము వెళ్లి చూశామన్నారు. అప్పటికే దుకాణంలోని సామగ్రి మొత్తం కాలిపోయిందని, ఈ కారణంగా రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశీలించిన ఎంపీపీ

దుకాణం వద్దకు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ వెళ్లి పరిశీలించారు. ఆయన రెవెన్యూ సిబ్బందికి ఫోన్ చేసి బాధితులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల రెవెన్యూ అధికారులు దుకాణాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఎంపీపీ వెంట వైఎస్సార్‌సీపీ యువ నాయకులు టీఎస్ చంద్రారెడ్డి, వార్డు మెంబర్, అన్నమయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.